

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక విద్యార్థులు

ప్రజాశక్తి - తణుకు


ఈ నెల 22, 23వ తేదీల్లో పెదవేగిలో జరగనున్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు మండపాక జెడ్‌పి హైస్కూల్ విద్యార్థులు వి.సుష్మ, ఎం.సత్యశ్రీ, బి.దుర్గాప్రసాద్, వి.నాగదుర్గ, ఎం.అనిల్, ఎస్.కృష్ణ ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.ఫణిశ్రీ తెలిపారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ సంకు సూర్యనారాయణను ఆ గ్రామ సర్పంచి జానా వెంకటలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు ఆత్మకూరు రామకృష్ణ, ఎస్ఎంసి ఛైర్మన్ గూడూరి మహాలక్ష్మి అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పోలీసుల్లో నిర్వేదం..!

- సమస్యలను పరిష్కరించని ప్రభుత్వం
- ఏడాదిన్నర గడిచినా వీక్లీఆఫ్ ఊసే కరువు
- నాలుగు సరెండర్ లీవుల సొమ్ముల్లో ఒక్కటే చెల్లింపుపై మండిపాటు
- భద్రతా హౌస్‌లోన్ కోసం పడిగాపులు
- ఏడాదిగా ఇవ్వని టిఎ బిల్లులు
- డిప్యూటీ సిఎం పవన్ ఇచ్చిన మాట మర్చిపోయారని ఆవేదన
- రెండు జిల్లాల్లో మూడు వేల మందికిపైగా పోలీస్ సిబ్బంది



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా కూటమి ప్రభుత్వం తీరుపై పోలీసుల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఏఒక్కటి అమలు చేయకుండా వంచిస్తున్న తీరుపై పోలీస్ సిబ్బందిలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. తాను పోలీస్ కానిస్టేబుల్ కుమారుడినని, కూటమి ప్రభుత్వం అధికారంలోకొస్తే పోలీసుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పిన డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపకపోవడంపై పోలీస్ సిబ్బందికి తీవ్ర ఆగ్రహం తెప్పిస్తోంది. దీంతో ప్రభుత్వం తమను వంచించిందనే అభిప్రాయం పోలీస్ సిబ్బందిలో నెలకొంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో మూడు వేల మందికిపైగా పోలీస్ సిబ్బంది పని చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వం పోలీసులకు ఇవ్వాల్సిన సరెండర్ లీవ్స్ సొమ్ము, వీక్లీఆఫ్ అమలు, భద్రతా హౌస్‌లోన్స్, టిఎ బిల్లులు వంటివి ఇవ్వకుండా తీవ్ర ఇబ్బంది పెట్టింది. తాము అధికారంలోకి వస్తే పోలీసులకు అన్నివిధాలా న్యాయం చేస్తామని సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చారు. అధికారంలోకొచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా పోలీసులను కనీసం పట్టించుకోని పరిస్థితి నెలకొంది. పోలీసులకు ప్రతి నాలుగు నెలలకు ఒకసారిగా 15 రోజుల వేతనం అదనంగా ఇవ్వడం జరుగుతోంది. వీటిని సరెండర్ లీవ్స్ అంటారు. కూటమి అధికారంలోకి వచ్చాక నాలుగు సరెండర్ లీవ్స్ సొమ్ము బకాయిలు ఉన్నాయి. నవంబర్ పూర్తయితే సరెండర్ లీవ్స్ ఐదుకు చేరుతాయి. దీపావళికి ముందు రోజు ఉద్యోగులకు ఏదో అద్భుతం చేసినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందులో ఒక సరెండర్ లీవ్స్‌కు సంబంధించిన సొమ్మును నవంబర్‌లో సగం, జనవరిలో సగం ఇవ్వనున్నట్లు తెలిపింది. అంటే సరెండర్ లీవ్ సొమ్ము రూ.30 వేలు అనుకుంటే రూ.15 వేలు ఒకసారి, మరోసారి రూ.15 వేలు ఇస్తారన్నమాట. నాలుగు సరెండర్ లీవుల సొమ్ముకు ఒకటిస్తూ అది రెండువిడతలుగా ఇస్తానని చెప్పడంపై పోలీస్ సిబ్బందిలో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. ఇదే దారుణమని పోలీస్ సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. టిఎ (రవాణా ఖర్చులు) కింద పోలీస్ సిబ్బందికి ప్రతినెలా రూ.2,250 ఇవ్వాల్సి ఉంటుంది. ఎస్ఐ, ఆపై అధికారులకు ఇది రూ.4,500 వరకూ ఉంది. ఏడాదిగా టిఎ బకాయిలుసైతం ఇవ్వడం లేదని పోలీసులు గగ్గోలు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి.

వీక్లీఆఫ్ ఊసే లేదు

పోలీస్ ఉద్యోగం సమయంతో సంబంధం లేకుండా పని చేయాల్సి ఉంటుంది. తిండి సైతం సమయానికి తినలేని పరిస్థితి. సిఎం, వివిఐపి బందోబస్తుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది. దీంతో పోలీసులు తీవ్రమైన పని ఒత్తిడికి గురవుతున్నారు. తాము అధికారంలోకి వస్తే వీక్లీఆఫ్ అమలు చేస్తామని కూటమి చెప్పింది. ఏడాదిన్నర గడిచినా ఇప్పటివరకూ వీక్లీఆఫ్ ఊసే లేకుండాపోయింది. దీంతో సిబ్బందిపై పని ఒత్తిడి పెరిగి అనారోగ్యం పాలవుతున్నారు. గత వైసిపి ప్రభుత్వం వీక్లీఆఫ్ విషయంలో ఇదేవిధంగా మోసం చేసింది. అధికారంలోకి వచ్చే వరకూ ఒకలా.. వచ్చిన తర్వాత మరోలా వ్యవహరించడం పాలకులకు అలవాటుగా మారిపోయిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీస్ సిబ్బంది ఇంటి నిర్మాణం చేసుకుంటే భద్రతా లోన్ ఇస్తారు. దీని దరఖాస్తు చేసుకున్నా బకాయిలు కాసేలా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసుల్లో ప్రభుత్వం తీరుపై తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది.

సెటిల్‌మెంట్ కింగ్ ఆ డిఎస్‌పి..!

- డిప్యూటీ సిఎంకు చేరిన భీమవరం డిఎస్‌పి అవినీతి వ్యవహారం
- జూదం, సివిల్ తగాదాల్లో భారీగా అవినీతి ఆరోపణలు
- నెలకు రూ.25 లక్షలకుపైగా దండుకుంటున్నట్లు చర్చ
- జిల్లా ఎస్‌పితో ఫోన్‌లో మాట్లాడిన పవన్‌కల్యాణ్
- డిఎస్‌పి వ్యవహారంపై సిఎం చంద్రబాబు సీరియస్
- ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే అంతా అని ప్రచారం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం డిఎస్‌పి రావూరి జైసూర్య సెటిల్‌మెంట్ కింగ్‌గా తయారయ్యారని, జూదం, సివిల్ తగాదాల సెటిల్‌మెంట్లను నిర్వహిస్తూ భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ఆ ప్రాంత కూటమి నేతలు డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేయడం, ఆయన జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మీకి మంగళవారం ఫోన్ చేసి మాట్లాడటం చర్చనీయాంశమైంది. ఆ వెంటనే హోం మంత్రి, డిజిపి దృష్టికి డిప్యూటీ సిఎం కార్యాలయ అధికారులు తీసుకెళ్లారు. ఈ విషయం సిఎం చంద్రబాబు దృష్టికి చేరడంతో హోం మంత్రి, డిజిపితో ఆయన డిఎస్‌పి వ్యవహారంపై చర్చించడం హాట్‌టాపిక్‌గా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పేకాట, కోడిపందేలు విచ్చలవిడిగా సాగుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పోలీసులు భారీగా మామూళ్లు తీసుకుని ఈ వ్యవహారం సాగిస్తున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. తాజాగా భీమవరం డిఎస్‌పి జైసూర్య వ్యవహారం డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ వరకూ చేరడంతో జూదం, సివిల్ తగాదాల సెటిల్‌మెంట్ల వ్యవహారం గుప్పుమంటుంది. ప్రస్తుత భీమవరం డిఎస్‌పి జైసూర్య గతంలో భీమవరం టుటౌన్, రూరల్ సర్కిల్ ప్రాంతాల్లో సిఐగా పని చేశారు. దీంతో ఆ ప్రాంత నాయకులతోపాటు అక్కడి వ్యవహారాలపై ఆయనకు పూర్తి అవగాహన ఉంది. భీమవరం డిఎస్‌పిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత జూదం, సెటిల్‌మెంట్లకు సంబంధించి మరింత రెచ్చిపోయినట్లు తెలుస్తోంది. భీమవరంలో మూడు క్లబ్‌లు ఉన్నాయి. వీటితోపాటు పలు అపార్ట్‌మెంట్లలోనూ, ఉండి, కాళ్ల, భీమవరం రూరల్ మండలాల ప్రాంతంలోనూ పెద్దఎత్తున పేకాట క్లబ్‌లు, కోడిపందేల నిర్వహణను డిఎస్‌పి ప్రోత్సహిస్తున్నట్లు చెబుతున్నారు. సివిల్ తగాదాల్లో జోక్యం చేసుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తాయి. డిఎస్‌పికి ఆ ప్రాంత ఎంఎల్‌ఎల మద్దతు కూడా ఉందని, దీంతో మరింత రెచ్చిపోతున్నట్లు చర్చ సాగుతోంది. డిఎస్‌పికి నెలకు మామూళ్ల రూపంలో రూ.25 లక్షలుపైనే అందుతున్నట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి. దీనిపై భీమవరం ప్రాంతంలో కొంతకాలంగా తీవ్రమైన చర్చ సాగుతున్నప్పటికీ ఇప్పటికి బయటికొచ్చింది.

డిప్యూటీ సిఎం జోక్యంతో వ్యవహారం బట్టబయలు

భీమవరం డిఎస్‌పి జైసూర్య సెటిల్‌మెంట్ల వ్యవహారంపై కొంతమంది కూటమి నేతలు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌ను కలిసి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీంతో ఆయన మంగళవారం జిల్లా ఎస్‌పి నయీంతో ఫోన్‌లో మాట్లాడారు. పవన్ ఫిర్యాదును సిఎం చంద్రబాబు సీరియస్ తీసుకుని, హోంమంత్రి, డిజిపితో సమావేశమై చర్చించినట్లు తెలిసింది. దీనిపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా ఎస్‌పిని ఆదేశించినట్లు తెలిసింది. దీంతో డిఎస్‌పిపై ఎటువంటి చర్యలు తీసుకుంటారోననే చర్చ సాగుతోంది. ఎంఎల్‌ఎల కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని, ఆయన్ని కాపాడేందుకు ఎంఎల్‌ఎలు ప్రయత్నించనున్నట్లు చర్చ నడుస్తోంది. ప్రభుత్వం ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచి చూడాలి. భీమరంలోనే కాకుండా రెండు జిల్లాల్లోనూ జూదం విచ్చలవిడిగా సాగుతోంది. ప్రభుత్వం దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

విచారణ చేసి నివేదిక ఇస్తాం

నయీం అస్మీ, జిల్లా ఎస్‌పి, పశ్చిమగోదావరి జిల్లా

భీమవరం డిఎస్‌పి జైసూర్యపై వచ్చిన ఆరోపణలపై డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ మాట్లాడారు. విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. విచారణ చేసి నివేదిక ఇస్తాం.

ట్రంప్ సుంకాలు రైతాంగానికి తీవ్ర నష్టం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహా రాజకీయ పార్టీలకు అతీతంగా ట్రంప్ విధానాలను నిరసించాలి

రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నాయకులు బి.బలరాం



పాలకోడేరు : దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బలరాం

ప్రజాశక్తి - పాలకోడేరు

ట్రంప్ విధించిన సుంకాల వల్ల భారత రైతాంగం తీవ్రంగా నష్టపోతుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నోరు మెదపరేంటని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్వ రాష్ట్ర అధ్యక్షులు, ఆక్వా రైతుల సంఘం రాష్ట్ర నేత బి.బలరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన సుంఖాలకు వ్యతిరేకంగా మోగల్లు గ్రామంలో రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యాన ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారతదేశంలో విధించిన సుంకాలు దేశంలో వ్యవసాయ రంగానికి, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మికులకు తీవ్ర నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్వా రైతాంగం సాగు చేసే రొయ్యలు, చేపలు తీవ్రంగా నష్టపోతారని, తక్షణం అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సుంఖాల వల్ల భారతదేశంలో వ్యవసాయం, పాడి పరిశ్రమ, ఆక్వా రంగం, ఫార్మారంగం, ట్రాక్టర్లు ఆటోమొబైల్ రంగు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలు పూర్తిగా దెబ్బతింటాయన్నారు. తక్షణం కేంద్ర ప్రభుత్వం ఈ సుంఖాలను ట్రంప్ రద్దు చేసేలా ఒత్తిడి తేవాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు నష్టం రాకుండా ప్రత్యామ్నాయ మార్గాలు చూడాలన్నారు. హెచ్ వన్ బి వీసాలకు పెట్టిన ఆంక్షలు దేశ విద్యార్థులు, యువత ఆశలు అడియాశలుగా మారాయన్నారు. ఉన్నత చదువుల కోసం లక్షల రూపాయలు ధారబోసిన విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రంగా నష్టపోతారన్నారు. కూటమి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధాన ప్రతిపక్ష వైసిపి నాయకుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఎందుకు నోరు మెదపడం లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని రాజకీయ పక్షాలు ఈ సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా అమెరికా విధానాలపై ప్రజలందరూ ఐక్యంగా ఉద్యమించాలని బలరాం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరామ్, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతి బాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు అశ్రియ్య, రైతు సంఘం మండల అధ్యక్షుడు పాల వెంకటస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి వీరవల్లి వెంకటేశ్వరరావు, ప్రజాసంఘాల నేతలు సైదు లక్ష్మణ్, కసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గణపవరం : భారతదేశంపై ట్రంప్ విధించిన 50 శాతం సుంకాల వల్ల దేశంలో లక్షలాది మందికి ఉపాధి దెబ్బతింటుందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పెచ్చేట్టి నరశింహమూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. రెండు సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా సోమవారం కేశవరం వంతెన సెంటర్‌లో ట్రంప్ చిత్రాలను దహనం చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ, నరశింహమూర్తి మాట్లాడుతూ భారతీయ వ్యవసాయ మార్కెట్‌లోకి అమెరికా దిగుమతులను అనుమితించేలా చేయటం ట్రంప్ దుర్బుద్ధని అన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు కేతాశ్రీను, రాయల నాగార్జున, నరాలశెట్టి రామకృష్ణ, సోడదాసి సంజీవీరావు, పివిఆర్.సుబ్రహ్మణ్యం, జోగి సత్యనారాయణ, దొంగ సత్యనారాయణ, పంపన మాణిక్యాలరావు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : ఇప్పటికైనా ట్రంప్ తన ఆర్థిక పెత్తనాన్ని ఉప సంహరించుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పేర్కొన్నారు. ట్రంప్ సుంకాలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యాన జగన్నాథపురం గ్రామంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు మాట్లాడుతూ మన దేశంలో కూడా ఇటీవల కాలంలో 50 శాతం సుంకాలను వ్యవసాయ రంగం మీద, ఎగుమతులు దిగుమతుల మీద భారాలు వేయడం జరిగిందని, దీనిని మన పాలకులు ట్రంప్‌ను పూర్తిస్థాయిలో వ్యతిరేకించలేని పరిస్థితిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షులు గాదినయుడు, గజ్జెరపు వెంకటేశ్వరరావు, పీలా కోటేశ్వరరావు, ముత్తా శివ, మారేడు శ్రీను, కోనవరపు సూర్యారావు, కర్రి శివరామకృష్ణ, కూనవరం మూర్తి, నమ్మి రామకృష్ణ, పొట్టూరి లక్ష్మణరావు, బొడ్డు వెంకటేశ్వరరావు, మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



యలమంచిలిలో..



తాడేపల్లిగూడెంలో..



గణపవరంలో..



తణుకులో..

తణుకు : ట్రంప్ టారిఫ్‌లతో భారతదేశంపై దాడి చేస్తున్నారని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు ఆరోపించారు. రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా వేల్పూరు గ్రామంలో స్థానిక టైలర్స్ బొమ్మ వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన ట్రంప్ దిష్టి బొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ.. భారతదేశ సంపదను, సార్వభౌమత్వాన్ని కాపాడాలని వీరభద్రరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సభ్యులు విశ్వనాథం సుబ్బారావు, వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, అందే కోట నరసింహారావు, తాళ్ల సత్యనారాయణ, బొక్క మోహన్ రావు, రుద్రాక్షల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంటపాడు : ట్రంపు అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అనేక దేశాల మీద పన్నులు విధించడం చాలా బాధాకరమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు సిరపరుపు రంగారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిర్ల పుల్లారెడ్డి, మండల నాయకులు బంకురు నాగేశ్వరరావు అన్నారు. గాంధీ బొమ్మ సెంటర్ వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వారు మాట్లాడారు. కార్యక్రమంలో పెనగంటి దుర్గా, నేతి శ్రీను, కోన ఏసు, బొంజిక రమేష్, వెన్నెల శివ, కట్టా నాగేశ్వరరావు, గొర్ల అప్పాజీ, గెదాపు గోవింద్, వైకుంఠ నాగబాబు, రెడ్డి జయరాం, కసిరెడ్డి శివ, నబ్బా రామకృష్ణ, అల్లు అప్పన్న పాల్గొన్నారు.

వీరవాసరం : అమెరికా భారతదేశంపై ఆంక్షలు విధించడాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సిఐటియు మండల కమిటీ విజ్ఞప్తి చేసింది. మంగళవారం వీరవాసరంలో జరిగిన సమావేశానికి పి.నాగరత్నం అధ్యక్షత వహించారు. సిఐటియు మండల కన్వీనర్ డి.వరలక్ష్మి మాట్లాడుతూ అమెరికా రకరకాల ఆంక్షలు పెట్టి భారత్‌పై పెత్తనం చేస్తుందని, భారత ప్రభుత్వం అమెరికాకు గట్టి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు మాట్లాడుతూ ట్రంప్ విధిస్తున్న ఆంక్షలు వల్ల ఇప్పటికే మన ఆక్వా రంగం కుదేలయిందని, ఉత్పత్తిరంగం దెబ్బతింటుందని అన్నారు. సమావేశంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు సంతోష్ వాణి, శ్రీనివాస్, నిర్మల, భవాని, అన్నపూర్ణ, మంగమ్మ, సాయి, తులసి పాల్గొన్నారు.

యలమంచిలి : భారత్‌పై అధిక సుంకాలను విధిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధానాలను నిరసిస్తూ వ్యవసాయ కార్మిక సంఘం, కౌలు రైతు సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో చించినాడ జాతీయ రహదారిపై ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బాతిరెడ్డి జార్జి మాట్లాడుతూ ఒకపక్క ట్రంప్ భారత్‌పై అధిక సుంకాలను విధిస్తున్నా మన దేశ ప్రధాని మోడీ మాత్రం మౌనం వహిస్తున్నారని, ఇది దేశ ప్రజలకు తీరని నష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాసవరపు సుబ్బారావు, ఎడ్ల మోహనరావు, కానేటి బాలరాజు, దేవ సుధాకర్, సరిపల్లి జయప్రభ పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం

కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కేంద్ర మంత్రి వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

దేశ అంతర్గత భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ ప్రాణాలను ఫణంగా పెట్టిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతోపాటు అమరులైన పోలీసు కుటుంబాలకు అండగా నిలవాలని కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజు అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ యార్డు ప్రాంగణంలో విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందిని స్మరించుకుంటూ స్మృతి పోలీస్ పెరేడ్ అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హాజరయ్యారు. తొలుత అమరవీరుల స్మారక స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి వర్మ మాట్లాడుతూ దేశ రక్షణతోపాటు ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడడంలో పోలీసులు ముందుంటారన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, సంఘ విద్రోహ శక్తుల అణచివేత, ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల నిర్వహణ సహా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ వంటి అనేక అంశాల్లో పోలీసుల పాత్ర చాలా కీలకమన్నారు. విరామం లేకుండా, రాత్రింబవళ్లు ప్రజల కోసం నిరంతరం పనిచేసేది పోలీసులేనన్నారు. పోలీసుల సంక్షేమానికి నిరంతరం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు పాకా వెంకట సత్యనారాయణ, భీమవరం ఎంఎల్‌ఎ పులపర్తి రామాంజనేయులు, జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి, ఎపిఐఐసి ఛైర్మన్ మంతెన రామరాజు, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జిల్లా ఎస్‌పి అద్నాన్ నయీం అస్మి, ఎఎస్‌పి వి.భీమారావు, డిఎస్‌పిలు ఎం.సత్యనారాయణ, ఆర్.జైసూర్య డి.విశ్వనాథ్, వి.పుల్లారావు, సిఐలు, ఎస్ఐలు, పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ సిహెచ్.మోజేష్ పాల్గొన్నారు. అనంతరం విధి నిర్వహణలో అమరులైన జిల్లాకు చెందిన పోలీసు కుటుంబ సభ్యులను ఎస్‌పి సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

28 నుంచి సిఐటియు జిల్లా మహాసభ

ప్రజాశక్తి - పెనుగొండ

ఈ నెల 28, 29, 30 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభ పెనుగొండలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ తెలిపారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గడచిన మూడేళ్లలో చేసిన ఉద్యమాలపై సమీక్షించడంతోపాటు జిల్లాలో కార్మికులు, ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చిస్తామని చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి రానున్న కాలంలో చేపట్టాల్సిన పోరాటాలకు రూపకల్పన చేస్తామన్నారు. దేశంలో, రాష్ట్రంలో, జిల్లాలో కార్మికులు, ఉద్యోగుల సమస్యలపై నికరంగా పోరాడేది సిఐటియునేనని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంలోని మోడీ ప్రభుత్వ అడుగు జాడల్లో నడుస్తోందని, దానిలో భాగంగానే పని గంటల పెంపు వంటి నిర్ణయాలు తీసుకుందని విమర్శించారు. ఉద్యోగుల, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా పాలకుల విధానాలతో ఆయా సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు సంబంధించి పిఎఫ్, ఇఎస్ఐ, కనీస వేతనాలు వంటివేమీ సక్రమంగా అమలు కావడం లేదన్నారు. కార్మికుల శ్రమ లేకపోతే సంపద సృష్టి అనేది జరగదని, అటువంటి సంపదను సృష్టిస్తున్న కార్మికవర్గానికి న్యాయం చేయకపోగా, మరింత దోపిడీకి గురయ్యే విధానాలు పాలకులు అవలంబిస్తున్నారని విమర్శించారు. రానున్న కాలంలో కార్మికులు, ఉద్యోగుల సమస్యపై సమరశీల పోరాటాలకు సన్నద్ధమవుతుందని, ఆయా అంశాలన్నీ ఈ మహాసభలో చర్చిస్తారని తెలిపారు. ఈ మహాసభ జయప్రదానికి అంతా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, షేక్ పాదుషా, శీలం ఏసు తదితరులు పాల్గొన్నారు.

27న తొలి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రైతులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు : జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో తొలి ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రం ఈ నెల 27న తాడేపల్లిగూడెంలో ప్రారంభించనున్నట్లు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టరేట్, ఆర్‌డిఒ కార్యాలయాల్లో కంట్రోల్ రూములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుండి ఆర్‌డిఒలు, తహశీల్దార్లు, వ్యవసాయ శాఖాధికారులతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై గూగుల్‌మీట్ ద్వారా ఆయన సమీక్షించారు. ధాన్యం సేకరణ ప్రారంభం కానున్న దృష్ట్యా సంబంధిత అధికారులు సత్వరమే ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో 50 శాతం గోనె సంచులు సిద్ధం చేయాలన్నారు. మండలస్థాయిలో రైతులు, మిల్లర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి ధాన్యం సేకరణకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. ప్రతి రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్లను ప్రారంభించి రైతులకు ఇస్తున్న గోనె సంచుల వివరాలు నమోదు చేయాలన్నారు. జిల్లాలో యూరియా నిల్వలు, రాబోయే మూడు నెలల కాలంలో అవసరమయ్యే ఎరువులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖాధికారి జెడ్.వెంకటేశ్వరరావు, డిఎస్ఒ ఎన్.సరోజ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఎమ్.డి.ఇబ్రహీం, జిల్లా సహకార శాఖాధికారి మురళీకృష్ణ, ఎస్ఎస్ఒ ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెసి రాహుల్‌కుమార్‌రెడ్డి

మొగల్తూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - మొగల్తూరు

అల్పపీడనం ప్రభావంతో మండలంలో మంగళవారం తెల్లవారు జాము నుంచి ఉరుములు, మెరుపు దలతో వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉదయమే వర్షం కురవడంతో కార్యాలయాలకు, విద్యాసంస్థలకు వెళ్లేవారు కొంత ఇబ్బంది పడ్డారు.



మొగల్తూరులో కురుస్తున్న వర్షం

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

పలుచోట్ల సంస్మరణ దినోత్సవం

ప్రజాశక్తి - ఆచంట

శాంతిభద్రతల పరిరక్షణకు విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ఎస్ఐ కె.వెంకటరమణ అన్నారు. విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అమరవీరుల దినోత్సవం పురస్కరించుకొని ఆచంట ఎంవిఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించి అమరవీరులకు జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : ప్రజల శాంతి భద్రతలకు పోలీసులు ఎనలేని సేవలు చేస్తున్నారని ఆరోగ్య వర్షిని ట్రస్ట్ ఛైర్మన్ నాగిడి రాంబాబు అన్నారు. మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అన్నారు. అనంతరం గ్రామంలో ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గుడాల తాతారావు, బొక్క కోటేశ్వరి, పలువురు గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు ఉన్నారు.

తణుకు : విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరులు చిరస్మరణీయులని తణుకు పట్టణ సిఐ ఎన్.కొండయ్య అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తణుకు నరేంద్ర సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తణుకు సర్కిల్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది తొలుత తణుకులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం నరేంద్ర సెంటర్‌లో సంస్మరణ స్థూపం వద్ద విధి నిర్వహణలో అమరులైన పోలీసు సిబ్బందికి నివాళులు అర్పించారు. తణుకు పట్టణ ఎస్ఐ కె.ప్రసాద్, ఇరగవరం ఎస్ఐ జానా సతీష్, ట్రాఫిక్ ఎస్ఐ డి.ఆదినారాయణ, ఎఎస్ఐలు సత్యనారాయణ పాల్గొన్నారు.

పాలకొల్లు : విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరులకు ఘన నివాళి అర్పించి అమరవీరుల కుటుంబాలకు ఆర్.కృష్ణయ్య జాతీయ బిసి సంక్షేమ సంఘం ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం పాలకొల్లు ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ముద్దాడ గణేష్ భవాని యాదవ్, జిల్లా ఉపాధ్యక్షులు కోరుకొండ సుబ్బారావు, పట్టణ అధ్యక్షులు ముక్కా సత్యనారాయణ, నియోజకవర్గ అధ్యక్షులు పొన్నమండ ముత్యాలరావు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా అలలు..

పర్యాటకులకు అనుమతి లేదు : ఎస్ఐ

మొగల్తూరు : బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సముద్ర అలలు ఉధృతి కారణంగా పర్యాటకులను సముద్ర స్నానాలకు అనుమతించేది లేదని ఎస్ఐ జి.వాసు తెలిపారు. వాతావరణ హెచ్చరికలు జారీ చేసిన కారణంగా పర్యాటకులు ఎవరూ సముద్ర స్నానాలకు రావడానికి అనుమతి లేదని ఆయన సూచించారు. పర్యాటకులు దీనిని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

పారిశుద్ధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

కొనసాగిన సమ్మె

తణుకు : తణుకు జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని కాంట్రాక్ట్ పారిశుద్ధ్య కార్మికులు తమ మూడు నెలల వేతన బకాయిలు చెల్లించాలని, 41 నెలల పిఎఫ్ బకాయి సొమ్ము కార్మికుల పిఎఫ్ ఖాతాల్లో జమ చేయాలని, తణుకు జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రి 150 పడకల స్థాయి కనుగుణంగా కనీసం మరో 50 మంది పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని కోరుతూ కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. అధికారులు కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయకుండా మున్సిపల్ వర్కర్స్‌తో ఆసుపత్రి పారిశుద్ధ్య పనులు నిర్వహింపచేయడం దురదృష్టకరమని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు. సమ్మెలో ఎపి మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధర్మాని పుష్పలత, ఎం.బేబీ, భారతి, వెంకటలక్ష్మి, ప్రసన్న కుమారి, హైమావతి, డి.శ్రీనివాస్, చింతాలు, పి.రామారావు, సిహెచ్.మంగమ్మ, పి.విజయలక్ష్మి, రేణుక, వి.సూరమ్మ పాల్గొన్నారు.

భారతీ హైస్కూల్ విద్యార్థులు ఔదార్యం

కేన్సర్‌తో బాధపడుతున్న విద్యార్థికి సాయం

వీరవాసరం: కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న వీరవాసరం ఎంఆర్‌కె జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి వైద్యం నిమిత్తం తమ వంతు ఆర్థిక సహాయం అందించి భారతీ హైస్కూల్ విద్యార్థులు తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. విద్యార్థులంతా కలిసి తలోకొంత నగదు వేసుకుని రూ. యాభై వేల రూపాయలను ఆర్థికసహాయం అందించి మొత్తాన్ని భారతీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు భారతీ ఆధ్వర్యాన అనారోగ్యంతో వైద్యం పొందుతున్న ఎస్.విజయ్ విద్యార్థి బంధువులకు మంగళవారం అందజేశారు. విజయ్ వైద్యానికి సుమారు రూ.పదిలక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో కొంత ప్రభుత్వం సిఎం రిలీఫ్ ఫండ్ నుండి ఆర్థిక సహకారం అందించింది. మిగిలిన మొత్తంకు ఎంఆర్‌కె హైస్కూల్ యాజమాన్యం నిధులు సేకరణ ప్రారంభించారు. ఈ విధంగా విద్యార్థి వైద్యం పొందుతున్న విషయం భారతీ హైస్కూల్‌కు తెలపగా వారు సానుకూలంగా స్పందించి కొంత మొత్తం సమకూర్చారు. ఈ సందర్భంగా భారతీ హైస్కూల్ యాజమాన్యానికి ఎంఆర్‌కె హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : ఎంపిడిఒ

ఆచంట : గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, గ్రామాల అభివృద్ధికి పంచాయతీ అధికారులు కృషిచేయాలని మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు తడి, పొడి చెత్త గురించి గ్రామాల్లో వీధుల, ఇళ్లు, పరిసరాల్లో గురించి అవగాహన కల్పించాలి. ముఖ్యంగా పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలని వివరించారు. పరిపాలనాధికారి వి.పూర్ణ బాబ్జీ, ఇఒపిఆర్‌డి కె.బలి పాల్గొన్నారు.

బస్టాండ్ అభివృద్ధికి కృషి

డిపో మేనేజర్ పి.ధనమ్మ

గణపవరం : గణపవరం ఆర్‌టిసి బస్టాండ్ అభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ పి.ధనమ్మ విలేకర్లకు మంగళవారం చెప్పారు. స్థానిక బస్టాండ్‌ని ఆమె పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ బస్టాండ్‌లో సీసీ రహదారి ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఒ విజయకుమార్, బస్టాండ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సైకాలజిస్ట్ టి.గంగాధర్

తాడేపల్లిగూడెం : విద్యార్థులు మాదకద్రవ్యాలు, ఆల్కహాల్‌కు దూరంగా ఉండాలని సైకాలజిస్ట్ టి.గంగాధర్ తెలిపారు. దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన నషా ముక్త్ భారత్ అభియాన్ అవగాహన సదస్సు మంగళవారం పెదతాడేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ లాల్‌బి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కేవలం చదువు మాత్రమే కాకుండా అనుసరించవలసిన మార్గం కూడా చూపించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఉపాధ్యాయులు, దేవి ఎడ్యుకేషనల్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారులకు బహుమతుల ప్రదానం

పెనుమంట్ర : దీపావళి సందర్భంగా బాణాసంచా కొనుగోలు చేసిన వినియోగదారులకు లక్కీడిప్ ద్వారా బహుమతులను మండలంలోని ఆలమూరు లక్ష్మి ఫైర్ వర్క్స్ వారు అందజేశారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు ప్రైజ్‌లను యాజమాన్యం అందజేసింది.

కూచిపూడిలో భాష్యం విద్యార్థుల ప్రతిభ

పెనుగొండ : పెనుగొండ భాష్యం పాఠశాలకు చెందిన విద్యార్థులు కొప్పిస్తి యామిని, కొప్పిస్తి భరద్వాజ్‌లు రిథమ్ డాన్స్ అకాడమీ లిటరరీ కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్ నెంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ డాన్స్ కౌన్సిల్ సిఐడి పారిస్-ఫ్రాన్స్ వారు గోవాలో నిర్వహించిన నేషనల్ డాన్స్ ఛాంపియన్‌షిప్ సీజన్ 10 కూచిపూడి విభాగంలో తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ తెలియజేశారు. విద్యార్థులు భవిష్యత్తులో వారు మరింత ఉన్నత స్థాయిలో రాణించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

ఆరోగ్యంపై జర జాగ్రత్త

గోదావరి జిల్లాల్లో విస్తరిస్తున్న కేన్సర్

పిల్లల వైద్య నిపుణులు వేగేశ్న రామకృష్ణంరాజు

ప్రజాశక్తి - కాళ్ల

కోస్తా జిల్లాల్లో ఆక్వా కాలుష్యం, ఆర్వో వాటర్ వినియోగం పెరిగిందని, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ప్రధానంగా కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుందని పిల్లల వైద్య నిపుణులు వేగేశ్న రామకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ప్రజాశక్తితో పలు అంశాలను ముచ్చటించారు. ఉరుకులు.. పరుగుల జీవితంలో ప్రజలు ఆహారం విషయంలో సరైన జాగ్రత్తలు పాటించకపోవటంతో పాటు సమయానికి సరైన ఆహారం తీసుకోకపోవటం వల్ల అనారోగ్య సమస్యలు తీవ్రమవుతున్నాయన్నారు.

ప్రశ్న : ఎప్పటి నుంచి వైద్య వృత్తిలో ఉన్నారు?

డాక్టర్ : గత 54 ఏళ్ల నుంచి వైద్య వృత్తిలో ఉన్నా. మూడు తరాల వారికి వైద్య సేవలు అందించా. ఒకప్పుడు వ్యాక్సిన్ లేకపోతే ఇన్ఫెక్షన్ డిసీజెస్ వచ్చేవి. యాంటీబయటిక్ ఇస్తే తగ్గిపోయేవి. ప్రస్తుతం వ్యాక్సిన్ వల్ల వ్యాధులు తగ్గడం, ప్రజల జీవన విధానం మారడం వల్ల కొత్తరకం వ్యాధులు వస్తున్నాయి. ఆటిజం అనేది సామాజిక కమ్యూనికేషన్, పరస్పర చర్య, ప్రవర్తనలో తేడాలు లేదా ఇబ్బందులతో కూడిన ఒక న్యూరో డెవలప్‌మెంటల్ పరిస్థితి. ఇది పిల్లల అభివృద్ధిని ప్రభావితం చేసే ఒక రుగ్మత, దీనిని ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్ అని కూడా అంటారు.


చిట్ - చాట్

ప్రశ్న : ప్రస్తుతం వస్తున్న సీజనల్ వ్యాధులు ఏమిటి?

డాక్టర్ : కోస్తా జిల్లాల్లో ఒకప్పుడు చెరువుల్లో, పంట కాలువల్లో నీటిని తాగునీటిగా ఉపయోగించేవారు. ప్రస్తుతం పంట, మురుగు కాలువల నిర్వహణ సరిగా లేదు. రైతులు తమ పొలాల్లోని, ఆక్వా చెరువుల్లోని కలుషితనీటిని నేరుగా వదిలేస్తున్నారు. వైరస్ ద్వారా వ్యాప్తి చెందుతోంది. అనేక వ్యాధులకు గురవుతున్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

ప్రశ్న : ఆర్వో వాటర్ తాగడం ఎంతవరకు మంచిది?

డాక్టర్ : ఆర్వో వాటర్ నిర్వాహకులు నిబంధనలు పాటించడం లేదు. ఆర్వో వాటర్‌లో ఇంకో ప్రమాదం ఉంది. మినరల్స్ తగ్గిపోవడం వల్ల 200-300 శాతం ఉంటుంది. వాటర్ బాటిల్స్‌లో మినరల్ కంటెంట్ 30-40 శాతానికి ఉంటుంది. నీరు, ఆహార పదార్థాల కలుషితం వల్ల కలరా, టైఫాయిడ్, కామెర్లు వ్యాధులు వస్తున్నాయి. 200 మినరల్స్ ఉంటేనే తాగడానికి ఆరోగ్యకరంగా ఉంటాయి.



ప్రశ్న : ఆక్వా కల్చర్ వల్ల వచ్చే అనర్థాలు?

డాక్టర్ : రైతులు బాధ్యత లేకుండా వరి పొలాల్లో, చేపలు రొయ్యల చెరువుల్లో జల్లే కెమికల్స్ వల్ల నీరు కాలుష్యమయంగా మారుతున్నాయి. నీటి నిర్వహణ సక్రమంగా లేకపోతే దీర్ఘకాలిక ప్రమాణాలు ఎక్కువగా ఉంటాయి. తాగునీటిని కొనుగోలు చేస్తున్నా ఆ నీరు పరిశుభ్రంగా ఉందో లేదో పరీక్షించుకోవాలి.

ప్రశ్న : కేన్సర్‌కు ప్రధాన కారణాలు?

డాక్టర్ : పండ్లు, కూరగాయలు, ఆకుకూరలకు రసాయనాలు ఎక్కువగా చల్లుతున్నారు. స్వీట్ షాప్‌లో వాడే కలర్స్ కూడా పాయిజన్. గోదావరి జిల్లాల్లో ప్రధానంగా కేన్సర్ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతున్నది. ఒకప్పుడు 60-70 వయసు ఉన్నవారికి కేన్సర్ వ్యాధి వచ్చేది. ప్రస్తుతం వయసుతో నిమిత్తం లేకుండా వస్తుంది. క్యాన్సర్‌కు ప్రధాన కారణాలు పొగాకు వాడకం, శారీరక శ్రమ లేకపోవడం, అధిక బరువు, మద్యం సేవించడం, పండ్లు, కూరగాయలు తక్కువగా తీసుకోవడం వంటి జీవనశైలి కారకాలతో పాటు జన్యుపరమైన కారకాలు కూడా ఉన్నాయని కొత్త అధ్యయనాలు తెలుపుతున్నాయి.

ప్రశ్న : పిల్లల ఆరోగ్యం పట్ల ఏయే జాగ్రత్తలు తీసుకోవాలి?

డాక్టర్ : కార్పొరేట్ విద్య వచ్చిన తరువాత ప్రతి విద్యార్థి క్రీడలు ఆడేందుకు అవకాశం లేదు. సూర్యోదయ సమయంలో సూర్యరశ్మి తగలకుండానే పాఠశాల, కళాశాలలకు విద్యార్థులు వెళ్తున్నారు. దీంతో చాలా మంది విద్యార్థులు 'డి' విటమిన్ లోపంతో బాధపడుతున్నారు.

ప్రశ్న : ప్రజల్లో కామన్ సెన్స్ తగ్గిపోవడానికి కారణాలు ఏమిటి?

డాక్టర్ : ఇటీవల ప్రజల్లో కామన్ సెన్స్ తగ్గిపోవడం జరుగుతుంది. డిజిటల్ యుగంలో ప్రత్యక్ష అనుభవాలు తగ్గిపోవడం, వర్చువల్ ప్రపంచంలో ఎక్కువ సమయం గడపడం, సోషల్ మీడియా వల్ల వాస్తవికత విచ్ఛిన్నం కావడం వంటివి ముఖ్యమైనవి. సామాన్య జ్ఞానం అనేది వ్యక్తిగత అవగాహన, సంస్కృతి, అనుభవంపై ఆధారపడి ఉంటుంది, ఇది వ్యక్తికి వ్యక్తికీ మారుతుంది.

ప్రశ్న : ఉదయం భోజనం చేసి సాయంత్రం టిఫిన్ చేస్తున్నారు? దాని ప్రభావం ఎలా ఉంటుంది?

డాక్టర్ : ప్రతి మనిషి వయసుకి, ఎత్తుకి తగ్గట్టుగా బరువు ఉన్నారా? లేదనేది ఎప్పటికప్పుడు చూసుకోవాలి. ఆహారంలో పిండి పదార్థాలు, కొవ్వులు తగ్గించుకోవాలి. పూర్వం శారీరక శ్రమ ఉండేది. ప్రస్తుతం ప్రతి ఒక్కరికి శారీరక శ్రమ లేదు. చిన్నారులకు ఆహార నియమాలు, శారీరక శ్రమతో పాటు రోజుకు కనీసం 8 నుంచి 10 గంటలు నిద్ర తప్పనిసరి. పిల్లలకు చిన్నప్పటి నుంచే వ్యాయామం, ధ్యానం తప్పనిసరిగా అలవాటు చేయాలి. ప్రతిరోజు మనిషికి యోగా ఎంతో అవసరం. యోగా చేయటం వల్ల ఎలాంటి రోగాలు ధరిచేరవు.

చదువుతోపాటూ క్రీడల్లోనూ సత్తా


ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్

ప్రజాశక్తి - మొగల్తూరు

తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తున్నారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వర్ధమాన రవిశంకర్ సర్కార్ అన్నారు. మొగల్తూరులోని పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డివిజన్ స్థాయిలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల డివిజన్ స్థాయిలో తణుకులో నిర్వహించిన అండర్-17 కేటగిరీలో 800 మీటర్ల పరుగు పందెంలో పాఠశాలకు చెందిన 8వ తరగతి చదువుతున్న విద్యార్థినులు నంగనం శ్రీవిద్య ప్రథమ స్థానంలో, మూటూరి అంజలి ద్వితీయ స్థానాల్లో నిలిచారని ప్రధానోపాధ్యాయులు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని అన్నారు.

చిత్రలేఖనంలో జిల్లా ప్రథమ స్థానంలో చాందిని

జిఎస్‌టి 2.0 సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రలేఖనం పోటీల్లో పెన్మెత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి చదువుతున్న షేక్ చాందిని జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా చాందినికి ప్రశంసా పత్రం అందించారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను రవి శంకర్ సర్కార్, ఉపాధ్యాయులు అప్పాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రావణి, అప్పలనాయుడు, ఎల్‌వై.ఆనంద్, జూనియర్ అసిస్టెంట్ హేమరత్నం అభినందించారు.




జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిఎం చంద్రబాబును కలిసిన త్రిమూర్తులు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సిఎం చంద్రబాబు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావును కృష్ణబలిజ పూసల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ గంటా త్రిమూర్తులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కృష్ణబలిజ పూసల వెల్ఫేర్, డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారి గంటా త్రిమూర్తులు మంగళగిరి లోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిసినట్లుగా తెలిపారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపినట్లు ఆయన తెలిపారు.



సిఎంతో గంటా త్రిమూర్తులు

'డిఎ జిఒను సవరించాలి'

ప్రజాశక్తి - భీమవరం

కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు దీపావళి కానుకగా ఒక డిఎ ప్రకటించడంతో సంతోషించే లోపు జిఒ రూపంలో వచ్చి ఆనందం కాస్త నీరు గారు పోయిందని, తక్షణం జిఒను సవరించాలని ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ విజయరామరాజు, జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం తెలిపారు. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024 జనవరి ఒకటో తేదీ నుండి 2025 సెప్టెంబర్ 30వ తేదీ వరకు రావల్సిన డిఎ అరియర్లు సర్వీస్ నుండి వైదొలిగే సమయంలో అంటే రిటైర్మెంట్ సమయంలో ఇస్తామని, చనిపోయిన ఉద్యోగికి అయితే వారసులకు ఇస్తామని డిఎ జిఒలో పేర్కొనడం దారుణమన్నారు.

ఆశలు అడియాసలు : ఎపిటిఎఫ్

ఉద్యోగ ఉపాధ్యాయుల ఆశలు ప్రభుత్వం అడియాశలు చేసిందని ఎపిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జి.ప్రకాశం, బివి.నారాయణ విమర్శించారు. ఈమేరకు బుధవారం వారు ఒక ప్రకటన విడుదలు చేశారు.

అసంబద్ధ జిఒలు తక్షణమే సవరించాలి : ఎస్‌టియు

ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 60, పెన్షనర్స్‌కి విడుదల చేసిన జిఒ 61లలో తెలిపిన అసంబద్ధ అంశాలను వెంటనే సవరించి ఉత్తర్వులు విడుదల చేయాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తుల శ్రీనివాస్, పి.సాయి వర్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వారు ఒక ప్రకటన చేశారు.

డిఎ జిఒ నష్టదాయకం : డిటిఎఫ్

ప్రభుత్వం విడుదల చేసిన డిఎ జిఒ ఉద్యోగ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టదాయకమని డిటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, ఆర్.ఎరకేశ్వరరావు తెలిపారు. ఈమేరకు వారు ఒక ప్రకటన విడుదల చేశారు.

తాడేపల్లిగూడెం : డిఎ ఉద్యోగి ఉద్యోగవిరమణ అనంతరం లేదా మరణించిన తరువాత ఇస్తాననడం అత్యంత బాధాకరమని తాడేపల్లిగూడెం యుటిఎఫ్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిఒ నెం 60, 61లను సవరించే చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.శీదేవి, జిల్లా కార్యదర్శి పి.శివప్రసాద్, మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి.తిరుపతిరావు, ఎస్ఎన్.శ్రీనివాసరావు ఈ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.

గణపవరం : ఎన్నికల్లో ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యుటిఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు బి.రమేష్, జి.భవాని ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏరియర్లను ఉద్యోగి రిటైర్మెంట్ తరువాత కాని, చనిపోయిన తరువాత కాని ఇస్తామని చెప్పటం దారుణంగా ఉందన్నారు.

పెనుమంట్ర : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు దీపావళి సందర్భంగా విడుదల చేసిన జిఒలో అధికారులు కావాలని డిఎ, ఏరియర్స్ బకాయిలపై రిటైర్మెంట్ తర్వాత ఇవ్వడం జరుగుతుందని ముఖ్యమంత్రికి చెప్పే చేశారా లేదా ముఖ్యమంత్రి విచారణకు ఆదేశించాలని రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు రవీంద్ర రాజు ఒక ప్రకటనలో కోరారు. జిఒలను వెంటనే సవరణ చేయాలన్నారు.

నేటి నుండి కార్తీక మాసం

ముస్తాబైన ఆలయాలు

ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామి వారి దేవస్థానం, పట్టణంలోని అమరేశ్వర స్వామి ఆలయాలలో కార్తీక మాసంకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 22 నుంచి నవంబరు 20 వరకు కార్తీక మాసం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తుల రాక ఎక్కువగా ఉంటుంది. ఈ నేపథ్యంలో స్వామి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన వసతులు కల్పించేందుకు దేవాదాయ శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక లైన్ల ద్వారా భక్తులను అనుమతిస్తారు. కార్తీక సోమ, ఆదివారాలు, కార్తిక పౌర్ణమి రోజుల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో స్వామికి ఆలయంలోనే అభిషేకాలు చేస్తారు. ఆయా రోజుల్లో మూల విరాటుకు వేకువజామున మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, అలంకరణలు చేసి భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. సాధారణ రోజుల్లో యథావిధిగా భక్తులు మూలవిరాట్టుకు అభిషేకం చేయించుకోవచ్చు. కార్తిక పౌర్ణమి నాడు జ్వాలతోరణం ఘనంగా నిర్వహిస్తారు. నరసాపురం అమరేశ్వర స్వామి ఆలయంలో గోదావరి రేవులో స్నానాలు ఆచరించిన తర్వాత దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక షెడ్డు ఏర్పాటు చేశారు. భక్తుల సహకారంతో తీర్థ ప్రసాదాలు ఏర్పాటు చేశారు. కార్తీక మాసం చివరి రోజు అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ప్రతి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా మరుగుదొడ్లు, తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్యం ప్రత్యేక దృష్టి పెట్టారు. ఏర్పాట్లన్నీ పూర్తి చేసినట్లు ఆలయ ఇఒ, కార్యనిర్వహణ అధికారి ఆర్‌వివిఎస్.రామచంద్ర కుమార్ తెలిపారు.



నరసాపురం : ఇఒ

ఆచంట : కార్తీక మాసం సందర్భంగా నేటి నుంచి నవంబర్ 21వ తేదీ వరకు ప్రసిద్ధిగాంచిన ఆచంట రామేశ్వర స్వామి ఆలయం వద్ద యాత్రికులకు అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఛైర్మన్ నెక్కంటి గజేశ్వరరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి ఆదిమూలం వెంకట సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ యాత్రికుల కోసం పుష్కరి స్థానాలు రేవు బాగు చేయించి అందుబాటులో తీసుకొచ్చినట్లు తెలిపారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం

ప్రజాశక్తి - ఉండి

దీపావళి పండుగను పురస్కరించుకుని సోమవారం రాత్రి మండలంలోని పెదపుల్లేరు గ్రామంలోని చిలువూరి అనసూయమ్మ అనే వృద్ధురాలు నివాసం ఉంటున్న తాటాకిళ్లపై బాణసంచా రవ్వలు పడి దగ్ధమవడంతో అనసూయమ్మ నిరాశ్రయులయ్యారు. స్థానికుల సాయంతో ఫైర్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పింది. స్పందించిన గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు రూ.2 వేల నగదును, 26 కేజీల బియ్యం, వంట సామాగ్రి, దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ సాయం కోసం ఎదురు చూడకుండా నిరాశ్రయులైన బాధితులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గేదెల నరసింహులు, వార్డు మెంబర్లు పెద్దింటి చిన నాగేశ్వర రావు, నల్ల సత్తిబాబు, పాటూరి శ్రీనివాస్ దొరబాబు, కొనగళ్ల శ్రీనివాస్, కీలపర్తి అప్పారావు, ఉగ్గిన సూరిబాబు, నల్ల రాంబాబు, గ్రామ పంచాయతీ కార్యదర్శి శివాజీ ఉన్నారు.




బాధితురాలికి సాయం అందజేస్తున్న సర్పంచి

శ్రీ సూర్య కళాశాల అధ్యాపకులకు ఘన సన్మానం

ప్రజాశక్తి - నరసాపురం

శ్రీసూర్య కళాశాలలో సుదీర్ఘకాలంగా తమ సేవలు అందిస్తున్న అధ్యాపకులను ఉత్తమ అధ్యాపకులుగా గుర్తించి ఆంధ్రప్రదేశ్ జూనియర్ కాలేజెస్ మేనేజ్మెంట్ అసోసియేషన్ సూర్య కళాశాల సంస్కృత విభాగ అధ్యాపకులు జాస్తి సుబ్బారావు, రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు కడలి లక్ష్మీనారాయణను తణుకులో ఆదివారం ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ చేతుల మీదుగా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎపిజెఎంఎ ప్రెసిడెంట్ ఘంటసాల బ్రహ్మాజీ ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. మంగళవారం శ్రీసూర్య కళాశాల మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఎపిజెఎంఎ వారి సన్మానం సందర్భంగా కళాశాల అధ్యాపకుల సమక్షంలో ఘనంగా సత్కరించారు. ఛైర్మన్ ఘంటసాల సూర్యనారాయణ ఉత్తమ అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు. సూర్య కళాశాల అకడమిక్ అడ్వైజర్ బి.రామచంద్ర రెడ్డి, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ఎఆర్ఎస్ కుమార్, డాక్టర్ కె.జానకీరామ్, డాక్టర్ ఫాజిల్, డాక్టర్ ఆర్.సతీష్ పాల్గొన్నారు.



అధ్యాపకులను సన్మానిస్తున్న బ్రహ్మాజీ

రేపు కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

నరసాపురం : శ్రీగౌతమి విద్యాసంస్థలు, భవానీ హోమియో నర్సింగ్ హోమ్, యుకెఎస్‌సి వనితా క్లబ్ నరసాపురం వారి ఆధ్వర్యాన విజయవాడ మణిపాల్ ఆసుపత్రి వారిచే ఉచిత రొమ్ము కేన్సర్ నిర్ధారణ పరీక్ష, గర్భకోశ కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఈనెల 23న జరుగుతాయని కార్యక్రమ కో ఆర్డినేటర్, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి శిరిగినీడి తెలిపారు. మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

IN THE HON'BLE COURT OF II ADDITIONAL SENIOR CIVIL JUDGE, VISAKHAPATNAM

E.A. 243/2023 in E.P. 30/2014 in O.S. 477/2007
Between:
Sri Padala Srinivasa Reddy ...Petitioner/D.Hr.
And
Sri Kalidindi Kasi Viswanadha Raju ...Respondent/J.Dr.
To
Respondents/proposed J.Drs.2 & 3:
2) Kalidindi Alivelu Manga Devi, w/o. late Kalidindi Kasi Viswanadha Raju, residing at Vempa Village, Mogalthuru Mandal, West Godavari district.
3) Kalidindi Varma, s/o. late Kalidindi Kasi Viswanadha Raju, residing at Vempa Village, Mogalthuru Mandal, West Godavari district.

Please take notice that the above petitioner/D.Hr. filed the above E.A. against both of you and the matter is coming for your appearance in the above proceedings and stands posted to **03-11-2025,** on that day both of you should personally or through Advocate attend before the above said Hon'ble Court at 10-30 A.M. failing which the matter will be heard and determined in your absence ex parte as per law.

(By order of the Hon'ble Court)
Tatavarthy Law Chambers (TLC)
T.V.S.K. KANAKA RAJU
M.A.S.PRABHA, Advocates
Visakhapatnam, Ph: 0891-2755164

నాలెడ్జ్ అసెస్‌మెంట్ పరీక్షలో శ్రీచైతన్య విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి - తణుకు

దేశవ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్‌లో మొదటి దశలో తణుకు శ్రీచైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి రెండవ దశకు అర్హత సాధించారు. గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రాలపై జరిగిన తొలి దశ పోటీ పరీక్షలలో 42 మంది విద్యార్థులు రెండవ దశకు అర్హత సాధించారు. గణితంలో 20 మంది, రసాయన శాస్త్రంలో 15 మంది, భౌతిక శాస్త్రంలో 7 విద్యార్థులు రెండవ దశకు అర్హత సాధించిన సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నాగ రజిని పాల్గొన్నారు. ఎజిఎం పార్థసారథి, రీజనల్ ఇన్‌ఛార్జి ఉదయభాస్కర్, కోఆర్డినేటర్ రామారావు అభినందనలు తెలిపారు. పాఠశాల డీన్ శ్రీనివాసరావు, సి బ్యాచ్ ఇన్‌ఛార్జి మణికంఠ, ఎఒ రాము, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ము నేరుగా జమ చేస్తాం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఆచంట నియోజకవర్గంలో కౌలు రైతులకు ధాన్యం అమ్మిన సొమ్మును నేరుగా వారి ఖాతాలో జమ చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మాజీ మంత్రి, ఆచంట ఎంఎల్ఎ పితాని సత్యనారాయణ ప్రకటించారు. మంగళవారం మండలంలోని మాముడూరులో పల్లె పల్లెకు పితాని కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. గ్రామ ప్రజలతో, అధికారులతో కలిసి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం కుల, మత, ప్రాంత, పార్టీ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా పని చేస్తుందన్నారు. అనంతరం మధ్యాహ్నం ఎస్ఐ పర్రులో జరిగిన గ్రామ సభలో ఆయన పాల్గొని వివిధ సమస్యలపై గ్రామ ప్రజలతో కలిసి చర్చించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాసుపోర్టు పడిపోయినది

పశ్చిమగోదావరి జిల్లా, ఇరగవరం మండలం, ఇరగవరం గ్రామానికి చెందిన కోటిపల్లి వీర వెంకట సత్యనారాయణ అను నేను ది. 29-09-2025 సం॥రం తేదీన నా పాసుపోర్టును నెం F 0216053 తీసుకుని ఇరగవరం ఇంటి నుండి తణుకు కు వెళ్లుచుండగా మార్గం మధ్యలో నా పాసుపోర్ట్ ఒరిజినల్ ఎక్కడో పడిపోయినది. నా పాసుపోర్టు కొరకు చుట్టుప్రక్కల అంతా వెతికిన దొరకలేదు. దొరికిన యెడల కింది అడ్రస్‌కు ఇవ్వగలరు.

చిరునామా:
కోటిపల్లి వీర వెంకట సత్యనారాయణ
ఇరగవరం (మండలం),గ్రామం
తేనేటి వారి వీధి, డోర్ నెంబర్ 6-37
పశ్చిమగోదావరి జిల్లా, సెల్ 9912024363

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, మాముడూరు గ్రామానికి చెందిన చేగొండి మల్లేశ్వరరావు, S/o. వెంకటేశ్వరరావు అను నేను చేసుకొనే విన్నతి. ది. 17-10-2025 వ తేది ఉదయం 11-00 గం.లకు భీమవరంలోని జువ్వలపాలెం రోడ్డులోని పాస్‌పోర్ట్ ఆఫీసు నుండి నా బైక్ పై వస్తుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ నెం: **H3553532** పడిపోయినది. దొరికినవారు ఈ క్రింది అడ్రసుకు తెలియజేయగలరు.

చేగొండి మల్లేశ్వరరావు
S/o. వెంకటేశ్వరరావు
డోర్ నెంబర్ : 5-153/2,
మాముడూరు గ్రామం,
పెనుమంట్ర మండలం, ప॥గో॥జిల్లా

పాస్‌పోర్టు పోయినది

పెన్మెత్స ప్రియాంక, భర్త, రామదాసు సాయినాథ్, డోర్ నెంబర్ 3-10-8/1, ఫ్లాట్ నెంబర్ 101, హనుమాన్ కాలనీ, పాలకొల్లు, పాలకొల్లు మండలం, ప.గో.జిల్లా, ఎ.పి ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను ది. 15-11-2019 లో బెంగుళూరు పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి **U1674312** నెంబర్ పాస్‌పోర్ట్ పొందియున్నాను. నేను ది. 10-09-2025 న పాలకొల్లు మా ఇంటి నుంచి పాలకొల్లు మెయిన్‌రోడ్ లో నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను జెరాక్స్ తీయించుటకు స్కూటీపై వెళుతుండగా దారిలో నా ఒరిజనల్ పాస్‌పోర్ట్ పడిపోయినది. ఎంత వెతికిన ఎక్కడ దొరకలేదు. ఎవరికైన దొరికిన పై నా అడ్రస్‌కు అందజేయగలరు.

నా సెల్ నెం: 7013222840

IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE (JUNIOR DIVISION) TANUKU
I.A.No. 197/2025 in O.S.No. 385/2024
Between:
Putta Murali Ramakrishna
...Petitioner/Plaintiffs
And
Katlaparthi Rama Rao (Died) & Others
...Defendants/Respondents
R2 : Katlaparthi Suryanarayana, S/o. Late Rama Rao, D.No. 12-63-5/1, Avinesh Residency, Flat No. 404, Peacock Lodge side street, Old Town, near by - pass road, Tanuku, W.G. Dt, TJCJC, Cell No. 9866506118, No e-mail address.

వాది మరియు పిటీషనర్ తరపున వేయించిన ప్రకటన

ఇందుమూలముగా 2వ రెస్పాండెంట్ పై I.A.No: 197/2025రు L.R. పిటీషనులో కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు నోటీసు పేపరు ప్రకటన ద్వారా ఆర్డరు వేసియున్నారు. కావున **ది. 07-11-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గానీ, లాయరు ద్వారా గానీ హాజరు అయి అభ్యంతరములు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షములో పిటీషను విచారణ చేసి తీర్మాణం చేయబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
గుడిమెట్ల వీర్రెడ్డి
పిటిషనరు తరపు న్యాయవాది, తణుకు
తణుకు
ది. 21-10-2025
సెల్: 94406 07793